వ్యాయామంతో గుండెకు రక్ష


మాట్లాడుతున్న వైద్యులు

లింగోజిగూడ: గుండె జబ్బుల బారిన పడకుండా నిత్యం వ్యాయామం చేయాలని ప్రముఖ వైద్యులు రాజీవ్‌గార్గ్, ముఖేష్ రావు తెలిపారు. ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా శనివారం బైరామల్‌గూడలోని గ్లెనిగల్ అవేర్ ఆసుపత్రిలో గుండె వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుండె జబ్బుకు ప్రధాన కారణం ధూమపానం, మద్యపానం అతిగా సేవించడమే అన్నారు. అధిక కొవ్వు, బీపీ, షుగర్ ఉన్న వారు ఎప్పటికప్పుడు గుండె జబ్బుల పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. చాలా మంది చిన్న వయస్సులోనే గుండె జబ్బుల బారిన పడడం బాధాకరమని జిమ్‌చేసే వారు త్వరగా శరీర ఆకృతి మారాలని అతిగా స్టెరాయిడ్స్ తీసుకుంటున్నారని అందుకే చిన్న వయస్సులోనే గుండెపోటుతో మృత్యువాత పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మల్లీంద్ర స్వామి, రాజేందర్, సతీష్, సుధీర్ పాల్గొన్నారు.

బడా బాబుల కబ్జాలు కనిపించవా?


నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

ఎల్‌బీనగర్: పేదల ఇళ్లను నిర్ధాక్షిణ్యంగా కూల్చుతున్నారు.. మరి విలువైన భూములను కబ్జాలు చేసిన బడా బాబులు సంగతేంటని బీఎస్పీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్క యాదగిరి ప్రశ్నించారు. ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ శనివారం బీఎస్పీ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. బైరామల్‌గూడ చెరువును ఓ పార్టీకి చెందిన నాయకుడు కబ్జా చేశాడని గతంలో ఎంపీగా ఉన్నప్పుడు చెరువును పరిశీలించిన రేవంత్ రెడ్డి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారని, కానీ.. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అలాగే హయత్‌నగర్ బాతుల చెరువు, ఫత్తులగూడ, మన్సూరాబాద్, నాగోలు చెరువుల్లో బడా బాబులు అక్రమంగా నిర్మించిన నిర్మాణాలు అధికారులకు కనిపించడం లేదా అన్ని ప్రశ్నించారు. పైసా పైసా కూడబెట్టి సొంతింటి కలను నెరవేర్చుకున్న పేదల ఇళ్లపై ప్రతాపం చూపి వారిని రోడ్డుపై నిలబెట్టడం దారుణమన్నారు. ఈ నిరసనలో స్వామి, అనిల్ యాదవ్, ఎర్ర అశోక్, సత్యం, వెంకట్ పాల్గొన్నారు.


కాస్మోపాలిటన్ కాలనీలో మ్యాన్‌హోల్ నుంచి పొంగుతున్న మురుగు

మురుగు పరుగు..
కాలనీలు కంపు!

మన్సూరాబాద్: ఇటీవల కురిసిన వర్షాలకు మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లుతున్నాయి. డ్రైనేజీలు నిండినప్పుడు శుభ్రం చేయాల్సిన సిబ్బంది ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో మ్యాన్‌హోళ్లు పొంగి రోడ్లపై ఏరులై పారుతున్నాయి. డివిజన్ పరిధి కాస్మోపాలిటన్ కాలనీలోని డ్రైనేజీ పొంగి మురుగు వీకర్‌సెక్షన్‌కాలనీ, ప్రెస్‌కాలనీలను ముంచెత్తుతోంది. సుమారు కిలో మీటర్ వరకు మురుగు కాలనీలోని రోడ్లగుండా పారుతూ తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతుంది. సమస్యను పరిష్కరించాలని స్థానికులు జలమండలి, సీవరేజీ బోర్డు అధికారులతో మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాస్మోపాలిటన్ కాలనీలో తరచూ డ్రైనేజీ రోడ్లపై పారుతున్న మురుగు లోంచే రాకపోకలు సాగిస్తూ ప్రమాదాలకు గురవుతున్నామని ఆయా ప్రాంతాల వారు వాపోతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయా ప్రాంతాల్లో పర్యటించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.


మురుగులోంచి వెళ్తున్న వాహనదారులు

కార్పొరేటర్ వినతి..

డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో తరచూ డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని, ప్రత్యేక చొరవతో సమస్యలను పరిష్కరించాలని జలమండలి, సివరేజీ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డిని జలమండలి కార్యాలయంలో మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్ పరిధిలో కాస్మోపాలిటన్‌కాలనీ, వీకర్‌సెక్షన్‌కాలనీ, వివేకానందనగర్, గణేష్‌నగర్, శైలజాపురికాలనీ, సూర్యోదయకాలనీ, చంద్రపురికాలనీలలో తరచూ డ్రైనేజీలు పొంగిపొర్లుతూ మురుగు రోడ్లపై పారుతుందని అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. అక్టోబర్ 2వ తేదీ నుంచి స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేస్తున్నామని, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు ఎల్‌బీనగర్ జనరల్ మేనేజర్‌కు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశామని ఈ సందర్భంగా ఎండీ అశోక్‌రెడ్డి తెలిపారని పేర్కొన్నారు.


ఎండీ అశోక్‌రెడ్డికి డ్రైనేజీ సమస్యలను వివరిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సామ రంగారెడ్డి

ఎల్‌బీనగర్: ప్రధాని మోదీ పుట్టిన రోజు సందర్భంగా నిర్వహిస్తున్న సేవ మహాయజ్ఞం కార్యక్రమంలో భాగంగా శనివారం సాహెబ్‌నగర్ త్రినేత్ర అంజనేయస్వామి దేవాలయలంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ.. అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి వరకు వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని దేశాన్ని అన్ని రంగాల్లో ముందు తీసుకెళ్తున్న గొప్ప నాయకుడు మోదీ అని కొనియాడారు. 29వ తేదీన నిర్వహించే మన్ కీబాత్ కార్యక్రమాన్ని ప్రతీ పోలింగ్ బూత్ స్థాయిలో వీక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో భాస్కర్ రావు, రవీందర్‌గౌడ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, అంజన్‌కుమార్ గౌడ్, విజయ్‌కుమార్, మల్లేష్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, విద్యాసాగర్ పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ ఏసీపీగా విజయశ్రీ

లింగోజిగూడ: హయత్‌నగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీగా విధులు నిర్వర్తిస్తున్న పావనీని బదిలీ చేస్తూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఉత్తర్వులను జారీ చేశారు. పావనీ స్థానంలో కార్వాన్ సర్కిల్‌లో పని చేస్తున్న టీహెచ్ విజయశ్రీని సర్కిల్ ఏసీపీగా బదిలీ చేశారు. విజయశ్రీకి హయత్‌నగర్ సర్కిల్‌తో పాటు ఉప్పల్ ఏసీపీగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తాం



ఎల్‌బీనగర్: పార్కులను అభివృద్ధి చేసి ఆహ్లాదంగా మార్చి ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తెలిపారు. బీఎన్‌రెడ్డినగర్ ఫేజ్-1 పార్కులో రూ.21 లక్షలతో చేపట్టనున్న ఓపెన్ జిమ్ పనులకు శనివారం ఆయన కాలనీవాసులతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీలలో నెల కొన్న ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ధ్యానంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ ప్రదీప్‌రెడ్డి, కాలనీ అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, నాయకులు రాజిరెడ్డి, ధన్‌రాజ్, నవీన్‌కుమార్, వెంకట్‌రెడ్డి, రాములు, రవికిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

నియామకం



చంచల్‌గూడ: బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర కార్యవర్గంలో పాతబస్తీకి చెందిన యువకుడికి చోటు దక్కింది. కుర్మగూడ డివిజన్ మాదన్నపేటకు చెందిన జనపాల మధు (లల్లు) రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. శనివారం ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ మధుకు నియామక పత్రం అందజేశారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని ఈ సందర్భంగా మధు పేర్కొన్నారు.

చైన్ స్నాచర్ రిమాండ్

లింగోజిగూడ: చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఓ యువకుడిని రిమాండ్‌కు తరలించిన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..మహబూబాబాద్ జిల్లా, వంగర మండలం, చిన్న వంగరకు చెందిన యసారపు ఉమేష్(26) నగరానికి వచ్చి స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. హయత్‌నగర్ పరిధిలోని పెద్దఅంబర్‌పేట, హైమవతి కాలనీ చెందిన సంగ లక్ష్మి ఈ నెల 26న కాలనీలో నడుచుకుంటూ వెళ్తుండగా ఉమేష్ ఆమె మెడలోని 0.2 గ్రాముల బంగారం పుస్తెను లాక్కొని పారిపోయాడు. శనివారం హయత్‌నగర్‌కు తన బైక్ నంబర్ ప్లేట్‌ను మడత పెట్టి శివార్లలో తిరుగుతూ మరో స్నాచింగ్‌కు పాల్పడాలని నిర్ణయించుకున్నాడు. బొమ్మల గుడి వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా బైక్ డిక్కీలో నకిలీ బంగారం ఉంది. అతని నుంచి రోల్డ్ గోల్డ్ నల్లపూసల తాడు, 0.2 గ్రాముల బంగారం పుస్తెను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

న్యాయం చేయాలి


చిరు వ్యాపారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

వనస్థలిపురం: వనస్థలిపురం రైతుబజారు వద్ద ఆక్రమణల తొలగింపులో భాగంగా ఉపాధి కోల్పోయిన చిరు వ్యాపారులు తమకు న్యాయం చేయాలంటూ శనివారం వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డితో మొర పెట్టుకున్నారు. ఎన్నో ఏళ్లుగా రైతుబజారు వద్ద పూలు, పండ్లు అమ్ముతూ జీవనం సాగిస్తున్నామని అర్ధాంతరంగా తమ తోపుడు బండ్లు, షెడ్లను తొలగించడంతో ఉపాధి కోల్పోయామని వాపోయారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఈ విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మూసీ నిర్వాసితులకు ఇళ్ల పట్టాల పంపిణీ

చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ శంకర్‌నగర్‌లో శనివారం హైదరాబాద్ జిల్లా స్పెషల్ కలెక్టర్ జ్యోతి మూసీ నిర్వాసితులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. శంకర్‌నగర్‌లో దాదాపు 130 మంది నిర్వాసితులు ఉండగా అందరికి పట్టాలు ఇస్తామని అధికారులు తెలిపారు. వీరందరికి చంచల్‌గూడలోని పిల్లిగుడిసెల డబుల్ బెడ్రూమ్‌లలో కేటాయించారు. ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం


రోడ్డు పనులు పరిశీలిస్తున్న మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని సమస్యలను పరిష్కరించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన డివిజన్ పరిధిలోని పద్మానగర్, బైరామల్‌గూడ, ఎంఆర్ఆర్, సాయిరాంనగర్, నిర్మలానగర్ కాలనీలో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పలు కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. కాలనీల్లో అభివృద్ధి పనులు జరిగేటప్పుడు కొన్ని ఇబ్బందులు తలెత్తుతాయని కాలనీవాసులు సంయమనం పాటించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆయన వెంట రవీందర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, దశరథ్‌గౌడ్, శేఖర్‌గౌడ్, వీరారెడ్డి, కృష్ణగౌడ్, రాఘవేందర్, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు శ్రీనివాస్, యాదయ్య, విజయ్ ఉన్నారు.

యువత రక్తదానం చేయాలి

మలక్‌పేట: రక్తదానం చేయడానికి యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని శ్రీ సాయి డిగ్రీ, పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్ దిలీప్ రెడ్డి అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ కాలేజీలో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సకాలంలో రక్తం దొరక్క చాలా మంది ఇబ్బందులు పడుతుంటారని రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ప్రతి ఏడాది రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి బ్లడ్ బ్యాంక్‌లకు అందజేస్తున్నామన్నారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు శ్రీనివాసాచార్యులు, వెంకటేశ్వర్లు, శేఖర్ రెడ్డి, శోభారాణి, సుష్మా పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

చెత్త రిక్షాల అందజేత


రిక్షాలను అందజేస్తున్న నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: పారిశుద్ధ్య కార్మికులు విధుల నిర్వహణలో అలసత్వం వహించొద్దని ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ క్లోం నవజీవన్‌రెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని కమలానగర్‌లో జీహెచ్ఎంసీ ద్వారా వచ్చిన చెత్త రిక్షాలను కార్మికులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ ఆశలత, డీఈలు దామోదర్, నీలిమ, ఏఈ హేము నాయక్, జవాన్ యాదయ్య, సూపర్ వైజర్లు వెంకట్ రెడ్డి, మధు, రాజ్‌కుమార్, కాలనీ అధ్యక్షుడు టీవీ.రావు, కార్యదర్శి సుబ్బారావు, వెంకటేశ్వర్లు, మదన్‌రెడ్డి, సంగ్రామ్ పాల్గొన్నారు.

మన్సూరాబాద్‌లో..

మన్సూరాబాద్: కాలనీలు, బస్తీల్లోని చెత్తను ఎప్పటికప్పుడు తరలించి పరిశుభ్రంగా ఉంచాలని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి సూచించారు. డివిజన్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో శనివారం సిబ్బందికి చెత్త సేకరణ రిక్షాలను, వీల్ బ్యారెల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఎస్ఎస్ చంద్రశేఖర్‌రెడ్డి, జవాన్ శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఎలు రవీందర్, హమీద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

అంతర్గత రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారులతో పాటు కాలనీలు, బస్తీల్లోని అంతర్గత రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తామని కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని డీఎస్‌నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రహదారి పనులను ఆమె కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్పొరేటర్ వెంట జంగం మధుకర్‌రెడ్డి, ఏఈ అన్సారి, ప్రశాంత్, బలరాం, చంద్రయ్య, కృష్ణ, వెంకటేష్ ఉన్నారు.

వాల్ పెయింటింగ్‌పై నిషేధం ఉపసంహరించుకోవాలి

నాగోలు: జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి నగరంలో గోడలపై పెయింటింగ్, వాల్ రైటింగ్స్‌పై నిషేధం విధించడం విరమించుకోవాలని తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ పెయింటింగ్ ఆర్టిస్ట్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ డీవీ రమణ, సీనియర్ నాయకులు నాగార్జునపు రాములు మాట్లాడుతూ.. పెయింటింగ్ చిత్రకారులకు ఫ్లెక్సీ, డిజిటల్ మీడియాతో పనులు లేక అప్పుడప్పుడు ఏదో ఒక పని చేసుకుంటూ వచ్చిన అరకొర ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్న ఈ సమయంలో గ్రేటర్ కమిషనర్ నిర్ణయంతో రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. వెంటనే కమిషనర్ ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని లేకుంటే కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యాకయ్య ,అల్వాల్ రెడ్డి, నాగరాజు, కమల్, పర్వేజ్, కందుకూరు నవీన్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్:సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.47, వంకాయ రూ.35, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.28, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.28, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.19, క్యారెట్ రూ.37, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.37, ఉల్లిగడ్డ రూ.54, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.28, సొరకాయ రూ13, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.10, చిక్కుడుకాయ రూ.50, అర్వి రూ.35, మునగ రూ.85, చిలుకడదుంప రూ.55, బీట్‌రూట్ రూ.28, కీర రూ.18, బీన్స్ రూ.55, క్యాప్సికమ్ రూ.65.

ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

లోక్ అదాలత్‌కు విశేష స్పందన


రాజీ ప్రతులను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్ రెడ్డి

రంగారెడ్డి కోర్టులు: రంగారెడ్డి జిల్లాలోని అన్ని కోర్టు ప్రాంగణాల్లో నిర్వహించిన లోక్ అదాలత్‌లో పలు కేసులను పరిష్కరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి పి. శ్రీదేవి అధ్యక్షతన జరిగిన లోక్ అదాలత్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శశిధర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించబడిన కేసులలో వాదులు, ప్రతివాదులు ఏకాభిప్రాయంతో తమ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించుకోవచ్చన్నారు. లోక్ అదాలత్ వేదిక ద్వారా ఏళ్ల తరబడి వాయిదా పడిన తగాదాలకు తక్షణ పరిష్కారం జరుగుతుందని, కక్షిదారులు కోర్టుకు చెల్లించిన ఫీజు కూడా తిరిగి పొందవచ్చాన్నారు. జిల్లా వ్యాప్తంగా 33 లోక్ అదాలత్ ధర్మాసనాలు ఏర్పాటు చేయగా, అందులో రాజీకి ఆమోదయోగ్యమైన సుమారు 1.50 లక్షల క్రిమినల్, సివిల్, మోటర్ వాహన ప్రమాదభీమా, బ్యాంకు రికవరీ ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కరించబడ్డాయని, కక్షిదారులకు 11,86,39,000 నష్ట పరిహారం చెల్లించినట్లు సీనియర్ సివిల్ న్యాయమూర్తి పి. శ్రీదేవి వెల్లడించారు. న్యాయమూర్తి డా.పట్టాభి రామారావు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎలన్నగారి కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గులగారి కృష్ణ, లోక్ అదాలత్ సభ్యుడు బాదం జగదీశ్వర్ పాల్గొన్నారు.


హయత్‌నగర్ కోర్టులో..

లింగోజిగూడ: హయత్‌నగర్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో హయత్‌నగర్ కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ శనివారం ముగిసింది.14వ అడిషనల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ సల్మా ఫాతిమా ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో పలువురు తమ కేసులను పరిష్కరించుకున్నారు. ఈ కార్యక్రమంలో 7వ అడిషనల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ సాంకేత్ మిత్రా, రిటైర్డ్ అదనపు జిల్లా జడ్జి కే.రవీంద్ర సింగ్, వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, ఇన్‌స్పెక్టర్లు నాగరాజ్‌గౌడ్, అశోక్‌రెడ్డి, అంజిరెడ్డి ఏపీపీ లావణ్య పాల్గొన్నారు.

కష్టపడే వారికి సరైన గుర్తింపు


మల్‌రెడ్డి రాంరెడ్డిని సత్కరిస్తున్న జైపాల్‌రెడ్డి

చైతన్యపురి: కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు లభిస్తోందని రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్‌గా నియమితులైన పన్యాల జైపాల్‌రెడ్డి శనివారం చైతన్యపురిలోని పార్టీ కార్యాలయంలో మల్‌రెడ్డిని కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుడిలా పనిచేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, జానిమియా, నరేందర్‌గౌడ్, ఆనంద్, సతీష్, విజయ్, అరుణ, చందు, షఫి, ఇంతియాజ్, హుస్సేన్, రబ్బాని, అస్లాం, వీరేందర్ పాల్గొన్నారు.

స్థానికేతరులకు 'డబుల్' ఇళ్లు ఇవ్వొద్దు


ఆందోళన చేస్తున్న వారిని సముదాయిస్తున్న పోలీసులు

చంచల్‌గూడ: మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఇళ్లను ఖాళీ చేయిస్తున్న క్రమంలో నిర్వాసితులకు డబుల్ బెడ్రూమ్‌లు కేటాయిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో మలక్‌పేట నియోజకవర్గంలోని మూసానగర్, శంకర్‌నగర్ ప్రాంత వాసులకు ఛావునిలోని డబుల్ బెడ్రూమ్‌లలో ఇళ్లు కేటాయించారు. ఈ క్రమంలో లబ్ధిదారులు శుక్రవారం రాత్రి ఛావునికి చేరుకున్నారు. డబుల్ బెడ్రూమ్ కేటాయింపుల కోసం ఎదురు చూస్తున్న వారు విషయం తెలుసుకుని అక్కడికి చేరుకుని తమకు కేటాయించిన తర్వాతే ఇతరులకు కేటాయించాలని ఆందోళనకు దిగారు. ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడటంతో పోలీసు బలగాలు మోహరించాయి. మాజీ కార్పొరేటర్ ముర్తుజా ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను సముదాయించే ప్రయత్నం చేశారు.

విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాలి

చంపాపేట: విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని యూఎఫ్‌టీడీసీ చైర్మన్, జిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాల్లో భాగంగా శనివారం చంపాపేట ఏపీఆర్ గార్డెన్‌లో తెలంగాణా గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్య అసోసియేషన్ (ట్రాస్మా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ప్రైవేట్ పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డు అందచేత కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల మానసిక స్థాయిని గుర్తించి బోధన చేయటంతో పాటు పాఠ్యాంశేతర విషయాలపై కూడా అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సిద్దాల బీరప్ప, సభ్యులు గుల్షన్, మల్లెల శ్రీనివాసరెడ్డి, మధుసూధన్, రమేష్, రాఘవేందర్, యాదగిరి శేఖర్, శ్రీనివాసరెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

సంక్షేమ పథకాలు రైతులకు అందేలా చూడాలి


వినతిపత్రం అందజేస్తున్న కరీంనగర్ వ్యవసాయ కమిటీ ఉద్యోగులు

చాదర్‌ఘాట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు రైతులకు అందేలా చూడాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు చిలకా నర్సింహారెడ్డి సూచించారు. శనివారం మలక్‌పేట వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో కరీంనగర్ నుంచి వచ్చిన జిల్లా వ్యవసాయ మార్కెట్ యూనిట్ సభ్యులను ప్రెసిడెంట్, సెక్రటరీ సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం నర్సింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ అమద్, సెక్రటరీ రమణ పాల్గొన్నారు.

'కేర్'లో అరుదైన శస్త్రచికిత్స

చాదర్‌ఘాట్: మలక్‌పేట కేర్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. శనివారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బ్రాంచ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కృష్ణమూర్తి వివరాలు వెల్లడించారు. నర్సయ్య (65)కు గతంలో మోకాలి శస్త్రచికిత్స నిర్వహించగా ఆ తర్వాత ఏడాదిగా తీవ్రమైన నొప్పితో బాధపడ్డాడు. వివిధ ఆస్పత్రులలో చూపించిన నొప్పి తగ్గలేదు. మలక్‌పేట కేర్ ఆసుపత్రికి తీసుకురాగా మోకాలి చుట్టూ యాంటిబయాటిక్ రెసిస్టెంట్ ఇన్‌ఫెక్షన్ ఉన్నట్లు గుర్తించారు. రోగికి సోకిన ఇంప్లాంట్‌ను తొలగించి ఇన్‌ఫెక్షన్‌ను నివారించడానికి యాంటిబయాటిక్ స్పేసర్‌ను ఉపయోగించి శస్త్రచికిత్స చేసినట్లు వెల్లడించారు.

